# సమిధలు



**స్వచ్ఛంగా ఉండాల్సింది మనసు. శరీరం మీద పడే మచ్చలు ఒక్కొక్కటే కాలగతిలో మాసిపోతాయి. వాటి గురించి దిగులు పడుతూ జీవితాన్ని నాశనం చేసుకోవడం అవివేకమే అవుతుంది**

"ప్రణూ, ఏమిటీ పిచ్చి పని?"

ప్రణీత ఆత్మహత్యాయత్నం చేసి నిష్ఫలమై, ఆస్పత్రిలో ఉందన్న విషయం తెలిసి ఆదుర్దా పడుతూ పరిగెత్తుకు వచ్చింది వినీల ఊర్నుండి వచ్చీ రాగానే.

"అసలు... అసలు నువ్వే ఈ పని చేశావా? ఎవరు, మీ అత్తగారా? మామగారా? లేపోతే మీ శ్రీవారా? ఎవరు? అయినా ఎందుకు?"

బారెడు జడ మెడ దాకా కాలిపోయింది.

మెడ, చేతులు, వేళ్ళ మీదా ఇంతింత లావున బొబ్బలు లేచి ఉన్నాయి. 'ఎంత మంటగా ఉందో' అనుకొంటే కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

నిస్త్రాణగా బెడ్‌కు తలానించి పంటి బిగువున బాధను భరిస్తున్న స్నేహితురాలిని చూసి చలించి పోతూ ఆర్తిగా అడిగింది వినీల.

"నిజం చెప్పవే. నువ్వే ఇలా చేసుకొన్నావంటే నమ్మబుద్ధి కావడం లేదు."

ప్రణీత, వినీల బాల్య స్నేహితులు.

ప్రణీత స్వభావం బాగా తెలుసు వినీలకు.

ప్రణీతకు చిన్నప్పట్నుంచీ అగ్గి అంటే భయం.

ఎవరైనా కిరోసిన్ పోసి కాల్చుకున్నారనో, కాల్చేశారనో విన్నా, పేపర్లో చదివినా భయపడి పోయేది.

మంటను ఎలా భరించగల్గారో అని ఆలోచిస్తూ బాధపడిపోయేది. చావాలంటే ఎన్నో మార్గాలుండగా 'కాల్చుకోవడం' అనే బాధాకరమైన పద్ధతినే ఎలా ఎంచుకొంటారోనని మథన పడేది.

ఏ నిప్పురవ్వ మీద పడుతుందోనన్న భయంతో భోగి మంటల దగ్గరకు సైతం వచ్చేది కాదు.

అలాంటి ప్రణీత తనంత తాను కిరోసిన్ పోసుకుని కాల్చుకొని చనిపోవాలనుకుందంటే ఎలా నమ్మడం?

"కొన్ని నమ్మాలి తప్పదు." పేలవంగా నవ్వుతూ కూర్చోమని సైగ చేసింది ప్రణీత.

"నో! నేన్నమ్మను. నువ్వబద్ధం చెబుతున్నావు."

"హుఁ, నిజాలు, అబద్ధాలు రెండూ మాటలే? రెంటినీ పలికేది నోరే. ఏది నిజమో, ఏది అబద్ధమో ఎలా తెలుస్తుంది? చెప్పేది నమ్మాలంతే కదా!"

"కాదు. పాలని, నీళ్ళని వేరు చేయగల నైపుణ్యం ఓ పక్షి అయిన హంసకే ఉన్నప్పుడు, మనుషుల స్వభావాలు, నైజాలు తెలిసిన మనిషి విచక్షణ వాళ్ళు చెప్పేది నిజాలో, అబద్ధాలో తెలుసుకోలేదా?"

"ఒక్కోసారి మనం చూసేది, వినేది, ఆఖరికి మాట్లాడేది కూడా నిజం కాకపోవచ్చు. ఒక్కోసారి అబద్ధాలు కూడా వాక్చాతుర్యం ముసుగులో నిజాలుగా చలామణీ కావచ్చు."

"నిజమే! కానీ, మనస్సాక్షంటూ ఒకటుంది కదా. దానికి తెలీదా?"

"నా మనస్సాక్షిగానే చెబుతున్నా విన్నీ. మా ఇంట్లో బావి లేదు దూకుదామంటే? ఉన్నా దూకే దాన్ని కాదేమో! నీళ్ళలో పడి ఊపిరాడక చావడం మాట అటుంచి ఏ రాళ్ళపైనో, బావి గోడలకో తగిలి... కాళ్ళూ చేతులూ విరిగి... ఓహ్! వద్దు. మరి ఉరేసుకోవాలంటే మా ఇంటి సీలింగ్ చాలా ఎత్తు. నో చాన్స్. అయినా, ఉరేసుకుంటే కనుగుడ్లు, నాలుకా బయటకు పొడుచుకు వచ్చి... భయంకరంగా... నన్ను చూసి మీరందరూ జడుసుకునేవారు కాదూ..."

వినీల ఇహ భరించలేక బావురుమంది.

"ఇలా, బొబ్బలెక్కి... బాగుందా? ఒక్కసారే భస్మమైపోవాలనుకున్నావా?"

ప్రణీత భర్త గవర్నమెంటాఫీసులో సూపర్నెంటుగా ఉన్నాడు. అతడు ఒక్కడే కొడుకు కావడంతో అత్తామామలు కూడా వారితోబాటే ఉంటారు.

ప్రణీతకు బిడియం ఎక్కువ. ఒంటరిగా ఎక్కడకూ వెళ్ళదు. అత్తమామలకు వేళకు అన్నీ అమరుస్తుండాలి కాబట్టి తాను రాకపోయినా పట్టించుకోకుండా వినీత వెళ్తొంటుంది ప్రణీత ఇంటికి. ప్రణీత అత్తమామలు కూడా నెమ్మదిగానే ఉంటారు. ప్రణీత కూడా వారి గురించి చెడుగా ఎప్పుడూ చెప్పలేదు. ఇహ ప్రణీత భర్త, నోరు తెరిస్తే ఏ ముత్యాలు, రత్నాలు రాలిపోతాయేమో అన్నంత మౌనంగా ఉంటాడు. ఎవరేం చెప్పినా విని తల ఊపడం, పెదాలు విడదీయకుండానే నవ్వడం. అంతే? అతని మనసులో ఏముందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రణీత అత్తమామల్లో ఈ మధ్య అశాంతి, అసహనం చోటు చేసుకుంటున్నాయి, పెళ్ళయి అయిదేళ్ళయినా ప్రణీత ఇంకా నెల తప్పలేదని.

"మూడేళ్ళకే ఇద్దర్ని కనేశావు. అదృష్టవంతు రాలివి!" తన పాపతో ఆడుకొంటూ తరచూ అనే ప్రణీత అత్తగారి మాటల్లో అసంతృప్తి స్పష్టంగా తెలిసేది. తనకెందుకో గిల్టీగా అనిపించేది.

"పిల్లల్ని కనడం గొప్పేనా?" తాను తేలిగ్గా అనేస్తే ఒప్పుకొనేది కాదు.

"కాదటమ్మా మరి. నీ స్నేహితురాలు చూడు. అయిదేళ్ళయినా పిల్లల ఊసే లేదు. మాకా ఒక్కగానొక్క బిడ్డ. వాడి కడుపునన్నా నలుగురు బిడ్డలు పుట్టి ఇల్లు కలకలలాడుతుందనుకుంటే... ఏదీ? వాడు ఉలకడు, పలకడు.

వంశోద్ధారకుడు లేకుండా మా వంశం ఇంతటితోనే ముగిసిపోతుందేమోనని ఒహటే దిగులు, బాధ అనుకో మాకు. దేవుడు లక్షణంగా అన్నీ ఇచ్చాడనుకొంటే, ఈ లోటు నీ స్నేహితురాలి వల్లే కదా!

పూజలు, పునస్కారాలు, వ్రతాలు, బాబాలు, స్వాములు... ఏ నమ్మకాలూ లేవు. మా బలవంతంతోనే అన్నీ. డాక్టర్లు, మందులు వద్దనడం లేదు. కానీ, ఏ పుట్టలో ఏ పాముందో. ఆవిడిహ నాన్‌స్టాప్‌గా మాట్లాడుతూనే ఉంటే మింగలేక కక్కలేక బాధను శుష్కహాసం మాటున దాచేసే గరళకంఠి ప్రణీత విషణ్ణవదనం చూడలేక తాను వచ్చేసేది, ఏమని ఓదార్చాలో కూడా తోచక.

తనకు తెలిసినంతవరకూ పిల్లల్లేరన్న లోటు తప్ప మరే బాధా లేదు ప్రణీతకు.

ఆ లోటే తనకు, అత్తమామలకు, భర్తకూ మధ్య అగాధాన్ని సృష్టించి ఉండాలి. వాళ్ళ సూటిపోటి మాటలు భరించలేకే ఇంతటి అఘాయిత్యానికి పాల్పడి ఉండాలి. ఆవేదనలో నుండే పుట్టుకువచ్చినా, ఆవేశానికి విచక్షణ ఉండదు. ఆ ఆవేశంలో చనిపోవాలన్న తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి ముఖ్య కారణం మనో ధైర్యాన్ని కోల్పోవడమే. అలాంటి బలహీన క్షణాలలో 'నీకోసం నేనున్నా'నంటూ మనో స్థయిర్యాన్ని ఇచ్చే

చిత్రాలు: నర్సిం



అండ ఉండాలి. ప్రేమపూర్వకమైన ఓదార్పు ఇవ్వగలగాలి.
నిర్హేతుక విశ్లేషణతో చెడు ఆలోచనలను మంచి వేపు మళ్ళించాలి.
"అయినా, నీకేమంత వయసు మించిపోయిందని? పెళ్ళయి ఎన్నేళ్ళయిపోయిందని. పెళ్ళి, పిల్లలు జీవితంలో భాగాలే గానీ జీవిత పరమావధి కాదుగా. ఎవరైనా మంచి డాక్టర్ల చేత పరీక్షించి మందులు గట్రా వాడితే పిల్లలు పుట్టకనేపోతారా? ఇంతలోనే ఇలా ప్రాణం తీసుకోవాలనుకొంటారా ఎవరైనా తెలివితక్కువగా?" మందలింపుగా అంటున్న వినీల వేపోసారి చూసి సన్నగా నిట్టూర్చి చెప్పింది ప్రణీత.
"నీకు తెలీదు కదూ, నేనిప్పుడు గర్భవతిని."
మంచు పిడుగు నెత్తిన పడినట్లు దిమ్మెర పోయింది వినీల.
ఏ పిల్లల కోసమైతే అయిదేళ్ళుగా తపించి పోయిందో, తాను చేసిన ఏ వ్రతాలు, నోములు, పూజలు ఫలించాయో, ఏ దేవుడు వరమిచ్చాడో, ఏ మందుల ప్రభావమో, ఏ బాబాల, స్వాముల మాహాత్మ్యమో గానీ, తీరా తన కడుపు పండి ఓ నలుసు తన కడుపున పడ్డ తర్వాత ఆత్మహత్యే కాదు, భ్రూణ హత్యకూ సిద్ధపడిందంటే ఆశ్చర్యంగా, అయోమయంగా ఉంది వినీలకు. ఏం మాట్లాడాలో కూడా తోచనట్లుగా, విస్మయంగా తననే నిలువు గుడ్లేసుకొని చూస్తున్న వినీలను చూసి సన్నగా నవ్వుతూ చెప్పింది ప్రణీత.
"కొంచెం నీళ్ళు తాగు, నాక్కూడా తాగించు."
"ఏం. అమ్మా వాళ్ళకు చెప్పలేదా? ఎవరూ రాలేదా? మీ అత్తగారు కూడా లేరే నీ దగ్గర?" అల్మారాలో నుంచి వాటర్ బాటిల్ తీసి తాగిస్తూ అడిగింది వినీల.

బహుశా అమ్మకు చెప్పలేదేమో. అత్తమ్మ ఇంటి దగ్గర వంటపని చూసుకోవాలి. ఆయన ఆఫీసుకెళ్ళేటప్పుడు క్యారేజీ ఇచ్చేసి వెళ్తారు. ఇక్కడ నర్సులు చూసుకొంటార్లే."
"అయినా, తల్లివి కాబోతూ ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం ఏమిటి? అదృష్టం! కడుపు దగ్గర ఏం కాలలేదు. ఇంతకీ నీ ప్రాబ్లం ఏమిటి?"
"తల్లిని కాబోవడమే ప్రాబ్లం." ప్రణీత మొహమంతా అలముకొన్న విషాదమేఘాలు!
"అదేమిటే?" విభ్రాంతిగా చూసింది వినీల.
"అబార్షను చేసుకోమని ఇంట్లో గొడవ."
"అబార్షనా!" పక్కలో బాంబు పడ్డట్లు అదిరిపడింది వినీల. "షాక్ మీద షాక్ ఇవ్వక అసలు విషయమేమిటో వివరంగా చెప్పవే." ఆత్రంగా చూసింది వినీల.
"ఆత్మీయులతో చెప్పుకుంటే ఆనందం పెరుగుతుంది. దుఃఖం తరుగుతుందంటారు. నేను తల్లిని కాబోతున్నానన్న సంతోషాన్ని నీతో పంచుకొందామంటే నువ్వు వేసవి సెలవులకు ఊరెళ్ళిపోయావు. ఉత్తరం ఎందుకు, వచ్చాక చెబుదామనుకొన్నా. ఇంతలో నా కర్మ ఇలా కాలుతుందనుకోలేదు." ప్రణీత కళ్ళలో ఉబుకుతున్న చెమ్మ.
ఆత్మీయంగా ప్రణీత తల నిమురుతోంది వినీల ఆర్ద్రంగా చూస్తూ.
"పది పదిహేను రోజులక్రితం పేపర్లో వార్త చూసి ఉంటావు. నక్కల నారాయణరావు ఉరఫ్ ప్రణవానంద బాబాను పోలీసులు అరెస్టు చేశారని."
"ప్రణవానంద బాబా చాలా మాహాత్మ్యం కలవాడని, అతని దర్శనభాగ్యంతోనే ఎలాంటి కష్టాలు అయినా తొలగిపోతాయని, అతని ఆశీర్వాద బలంతో పెళ్ళిళ్ళు కానివారికి పెళ్ళిళ్ళవుతాయని, వివాహితులకు సంతాన యోగం కలుగుతుందని, అతనికి దేశ విదేశాల్లో సైతం అసంఖ్యాక భక్తులు, శిష్యులూ ఉన్నారని మొన్నటి దాకా బాబాను నమ్మిన వారికి తెలిసిన నిజం! ప్రచారం! అయితే,



చాలా సేపు మౌనంగా ఉండిపోయిన ప్రణీత, తనలోని మానసిక సంఘర్షణను నిశ్వసిస్తున్నట్టుగా దీర్ఘంగా నిట్టూర్చింది. "నేను బిడ్డను కంటాను."

బాబా తన సన్యాసి వేషం గుట్టు మాటున తన వద్దకు వచ్చేవారిలో నచ్చిన కన్నెపిల్లలను, వివాహితలను మభ్యపెట్టి, మత్తు పెట్టి, మాయచేసి సంసారం చేస్తున్నాడన్న నగ్నసత్యం రట్టయి పత్రికలకెక్కడం, అతన్ని పోలీసులు అరెస్టు చేయడం జరిగింది."
"అయితే?" దానికి, దీనికీ ఏమిటి సంబంధం అన్నట్లుగా వినీల కనుబొమ ముడిపడింది.
కొద్దిసేపు మౌనంగా ఉండిపోయింది ప్రణీత తనలో చెలరేగుతున్న అలజడిని అదుపు చేసుకొంటున్నట్లుగా.
"ఆ బాబా దగ్గరకు వెళ్ళివచ్చాకే కదా నేను గర్భవతినయ్యానన్న అనుమానంతో మా మామగారు, అత్తగారు సాధించడం, వేధించడమే కాదు, అబార్షను చేసుకోమని..." ప్రణీత కళ్ళు వర్షిస్తున్నాయి.
నా అంతట నేను వెళ్ళానా? నా ఇష్టమొచ్చినట్లు విచ్చలవిడిగా తిరిగానా? రాను మొర్రో అంటున్నా బలవంతంగా బాబాలు, స్వాములు అంటూ నన్ను తీసికెళ్ళింది వాళ్ళు. ఇప్పుడు అనుమానంతో వేపుకు తింటున్నదీ వాళ్ళే. ఆ మెంటల్ టార్చర్ భరించలేక..."
హృదయవిదారకంగా రోదిస్తున్న స్నేహితురాలిని చూస్తుంటే బాధగా, జాలిగా ఉన్నా, లేని కోపాన్ని తెచ్చిపెట్టుకుంటూ కాస్త కటువుగానే అడిగింది వినీల.
"అగ్ని పునీతవు కావాలనుకొన్నావా?"
"కాదు. నాకు నేనే అగ్ని సంస్కారం చేసుకోవాలనుకొన్నాను. నన్ను చూస్తేనే అసహ్యపడేవారు, నా శవానికి అంత్యక్రియలు చేయటానికి ఇంకెంత అసహ్య..."
"ప్రణూ..."
"అవును విన్నీ." గద్గదంగా చెప్పింది ప్రణీత.
"నీకు తెలీదు నేను అనుభవించిన నరకయాతన. పాప పుణ్యాలు పైవాడికే తెలియాలి. నిజంగా చెబుతున్నాను. బాబా మందిరంలో ఏం జరిగిందో నాకు తెలీదు. అత్తగారు, మామగారు అక్కడే ఉన్నారు. ఏకాంతంగా బాబా ధ్యానం చేయాలంటూ నన్నో గదిలోకి తీసికెళ్ళారు.
బాబా అనుగ్రహం కలిగిందంటూ, బాబా ప్రసాదమని ఓ గ్లాసుడు పాలు నాచేత తాగించారు. కాసేపటికే గాఢమైన సుషుప్తి. నేను అపస్మారకంలో ఉండగా ఏం జరిగిందో? ఒకవేళ జరగకూడనిదే జరిగి ఉన్నా అందులో నా ప్రమేయం గానీ, బాధ్యత గానీ లేదు కదా?
నెల తప్పానని తెలియంగానే బాబాను పొగడ్తలతో, కానుకలతో ముంచెత్తినవారు ఇప్పుడు నన్ను హింసించడం ఏం న్యాయం? నేనేం నేరం, తప్పూ చేశానని నాకీ శిక్ష?
ముక్కూ మొహమూ తెలియకపోయినా, కాషాయం కట్టిన ప్రతి వెధవనూ దైవాంశసంభూతుడని నమ్మేసేవాళ్ళు, ఏళ్ళతరబడి కలసిమెలసి ఉన్న ఆత్మీయులను నమ్మకపోవడం అమానుషం కాదా? అన్యాయం కాదా?"
ప్రణీత ఆవేదనలో నిజాన్ని అర్థం చేసుకోవాలంటే విశాల దృక్పథంతో ఆలోచించే హృదయం కావాలి.
"మీవారు ఏమంటారు?" సాలోచనగా చూసింది వినీల.
"హుఁ, వాళ్ళు మాటలతో వేధిస్తే, ఆయన మౌనంతో సాధిస్తారు. తెలిసిందే కదా." నిరసనగా చెప్పింది ప్రణీత.
చాలా సేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు ఎవరి ఆలోచనల్లో వాళ్ళు.
"ప్రతి సమస్యకూ ఆత్మహత్యే పరిష్కారం కాదు, కాకూడదు." వినీల నెమ్మదిగా, స్థిరగంభీర కంఠంతో చిన్న పాపాయిని బుజ్జగించినట్లుగా చెప్పడం మొదలెట్టింది.

"మన పితృస్వామిక వ్యవస్థలో, పురుషాధిక్య సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలూ అన్నీ మగవాడికి అనుకూలంగా మలచుకొన్నవే. స్త్రీల శీలానికి, పవిత్రతకు మాత్రమే ప్రాధాన్యం! యాక్సిడెంటల్‌గా జరిగే కొన్ని సంఘటనలను స్పోర్టివ్‌గా తీసుకోకుండా, పాలు తాగే పసికూన ఏ రేపిస్టు కిరాతకానికో గురయినా, చెడిపోయిందంటూ ఈసడించుకొనే దారుణ పరిస్థితుల్లో ఉన్నాం మనం. ఇది మారాలంటే ముందు మన స్త్రీల ఆలోచనలలోనే మార్పు రావాలి. ఆ దొంగ బాబాగాడి మందిరంలో జరిగిన బాగోతంలో బలైన ఎందరో స్త్రీలలో నువ్వూ ఒకర్తివి కావచ్చు, కాకపోవచ్చు. కానీ, అందరూ నీలా ఆత్మహత్య చేసుకోవాలనుకొంటే ఎంతమంది చావాలో కదా. పైకి చెప్పుకో లేకపోయినా వాళ్ళూ లోలోపల బాధపడుతూనే ఉంటారుగా? నువ్విప్పుడు తీసుకొనే నిర్ణయం వాళ్ళ సమస్యకూ పరిష్కార మార్గం కావచ్చు కదా. ఆలోచించు." ఆగి దీర్ఘంగా చూసింది వినీల.

"కానీ, నా బిడ్డకు తండ్రి..." సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న ప్రణీత వేపు జాలిగా చూసింది వినీల.

"పిచ్చి ప్రణూ. ప్రపంచంలో 'నిజం' అంటూ ఉంటే 'తల్లి' మాత్రమే. తండ్రి కేవలం 'నమ్మకం' మాత్రమే. తన బిడ్డకు తండ్రి ఎవరో తల్లి చెబితేనే తెలిసేది బిడ్డకైనా, సంఘానికైనా. నీ బిడ్డకు తండ్రి నీ భర్తని సంఘం నమ్మే నిజం. కాదన్న అనుమానం అత్తింటిది. ఈ రెంటిమధ్యా పాతికేళ్ళయినా నిండని నీ బతుకును, ఇంకా ఊపిరైనా పోసుకోని నీ బిడ్డనూ బలి చెయ్యడం మూర్ఖత్వమే కాదు, అమానుషత్వం కూడా.

అనాదిగా మగవాళ్ళ దౌష్ట్యం, మోసం అనే రావణకాష్టంలో నువ్వ ఓ సమిధ కావడానికి వీల్లేదు. చదువుకొన్నదానివి, నీకింతగా చెప్పాలా? మనసు స్తిమితపరచుకొని ప్రశాంతంగా ఆలోచించు. మనిషి ద్వారా, పక్షుల రెట్టల ద్వారా, గాలి ద్వారా, నీటి ద్వారా- ఎలా వచ్చి తన గర్భాన చేరినా, విత్తనానికి జన్మనివ్వడంలేదా క్షేత్రం? నీ గర్భాశయాన చేరిన విత్తు ఎవరిదైనా సరే, నీ రక్తమాంసాలతోనే కదా రూపుదిద్దుకొంటోంది. కాబట్టి అది నీ బిడ్డ. అచ్చంగా నీదే. ఆ బిడ్డను చంపే హక్కు, అధికారం ఎవరికీ లేదు నీతో సహా. లేనిపోని అనుమానాలతో మనసు, జీవితం పాడుచేసుకోవద్దు.

నువ్వెవరికీ తల వంచుకొని సంజాయిషీలు, సమాధానాలు చెప్పుకోవాల్సిన అవసరం లేదు. పది నెలలు మోసి, ప్రసవ వేదన పడే స్త్రీకి మాత్రమే బిడ్డ కావాలో, వద్దో నిర్ణయించుకొనే హక్కు, అధికారం ఉంటాయి. మీవాళ్ళను ధైర్యంగా ఎదుర్కో. ఇప్పుడు నవ్వెటూ గర్భవతివయ్యావు కాబట్టి, ఇనేళ్ళూ పిల్లల్లేకపోవడానికి కారణం నీ భర్తలో లోపమేనని రచ్చకెక్కితే పరువు తక్కువ కాదా అని ప్రశ్నించు, బెదరించు. ఇహ ఇంట్లో ఎవరూ నీతో మాట్లాడే సాహసం కూడా చేయరు. ముందస్తుగా నీక్కావాల్సింది ఆత్మస్థయిర్యం, నీమీద నీకు విశ్వాసం. మనసనే కోట దృఢంగా ఉన్నంతవరకూ జీవన సమరంలో ఓటమి అనేదే ఉండదు."

స్నేహితురాలి మాటల్లోని ధైర్యమనే సారాన్ని తనలోకి ఇంకింపజేసుకొంటున్నట్లుగా తీవ్రంగా ఆలోచిస్తూ చాలాసేపు మౌనంగా ఉండిపోయిన ప్రణీత, తనలోని మానసిక సంఘర్షణను నిశ్వసిస్తున్నట్లుగా దీర్ఘంగా నిట్టూర్చింది.


"నేను బిడ్డను కంటాను." దృఢంగా ఉన్న ప్రణీత మాటలకు తృప్తిగా చూస్తూ చెప్పింది వినీల.

"మనసు స్వచ్ఛంగా ఉన్నంతవరకూ కాలగతిలో మాసిపోయే శరీరం మీద పడే మచ్చలకు భయపడాల్సిన అవసరంగానీ, బాధపడాల్సిన అగత్యంగానీ లేనే లేదు. ■



# అన్యాయాలపై అధ్యయనం

## తెలంగాణలో పత్తి రైతుల సాధకబాధకాలపై సమగ్ర పరిశీలన



వ్యవసాయంలో
సంక్షోభం
పత్తి విషాదగాథ
ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1-1-16/10సి, జవహర్ నగర్, హైదరాబాద్-500 020
పేజీలు:86. వెల:రూ.20/-

జి. రాజశుక

దేశంలో సంచలనం సృష్టించిన పత్తి రైతుల ఆత్మహత్యలపై ప్రత్యక్షంగా అధ్యయనం చేసేందుకు ఆరుగురు నిపుణులు తెలంగాణ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి, రైతులను కలుసుకుని, వారితో వారి సాధకబాధకాలను చర్చించి, సంబంధిత అధికారులతో కూడా మాట్లాడి ఈ చిన్న వ్యాస సంకలనాన్ని రూపొందించారు. ఈ పుస్తకం వ్యవసాయదారులకు, వ్యవసాయేతరులకు కూడా అర్థమయ్యేటట్లు పత్తి రైతుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను సూచించింది. ఈ ఆరుగురి బృందంలో సివిల్ ఇంజనీర్ కె.జె. రామారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు లావణ్య, రామాంజనేయులు, వ్యవసాయ పట్టభద్రుడు సురేష్, దస్తకార్ సంస్థకు చెందిన ఉజ్ర ఉన్నారు.

పత్తి రైతుల ఆత్మహత్యలతో తెలంగాణ అట్టుడుకుతున్నప్పుడు రామారావు, లావణ్య, రామాంజనేయులు, ఉజ్రమ్మలు ఆ గ్రామాలను సందర్శించి సమస్యలకు గురైన రైతుల కుటుంబాలతో మాట్లాడారు. పత్తి సాగు గురించి, ప్రత్యేకించి పురుగుల యాజమాన్యం గురించి సమాచారం కోసం ఎదురు చూస్తున్నామని ఆ గ్రామస్థులు చెప్పారు. ఈ సమాచారాన్ని సేకరించి రైతులతో చర్చించాలని ఈ బృందం నిర్ణయించింది. ఈ సమాచార సేకరణ, రైతుల స్థితిగతుల పరిశీలనలో వారికి రైతుల జీవితాలను నిశితంగా, క్షుణ్ణంగా పరిశీలించడానికి అవకాశం కలిగింది. ముమ్ముందు తెలంగాణ రైతులకు సన్నిహితంగా ఉంటూ వారికి తాజా వ్యవసాయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని కూడా ఈ బృందం భావించింది. సమస్య పత్తితో మొదలైనప్పటికీ, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ఇతర వ్యవసాయ నిపుణులు ఇలాగే జవాబుదారీ లేకుండా వ్యవహరించే పక్షంలో ఇతర పంటలకు కూడా ఈ సమస్య పాకే ప్రమాదం ఉందని ఈ పుస్తకం చెప్పకనే చెప్పింది. జాగ్రత్త పడకపోతే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందమే అవుతుంది.

రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, వ్యవసాయ కళాశాలలు, వ్యవసాయానికి సంబంధించిన పత్రికలు, వ్యవసాయ నిపుణులు వగైరాలకు లోటేమీ లేదు. వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన ఫలితాలు రైతులకు వెళ్ళేటట్లు చూడాలని అడపాదడపా ప్రకటనలు చేసే రాజకీయ నాయకులకు, అధికారులకు కూడా కొదవేమీ లేదు. అయినప్పటికీ, గత రెండేళ్ళలో తెలంగాణ జిల్లాలలోనూ, గుంటూరు, ప్రకాశం జిల్లాలలోనూ వందలాది మంది పత్తి రైతులు పంటల వైఫల్యం కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇది పాలనా దక్షత విషయంలో ప్రభుత్వ వైఫల్యంగా కనిపించలేదంటే ఆశ్చర్యమేమరి!

యువతరంలో ఉన్న ఆవేశం రైతుల అవస్థలకు కొంతంత తోడైంది. సరైన సలహాలు ఇవ్వడం, సూచనలు చేయడం అవగాహన కలిగించడం వ్యవసాయ శాఖాధికారులకు పట్టని విషయం. పురుగుల మందుల వ్యాపారులు ఎంత చెబితే అంత. వారానికి ఒకసారన్నా పురుగుల మందు చల్లకపోతే ఎలా అని రైతులు అమాయకంగా ప్రశ్నించే వారంటే అందుకు ఎవరిని తప్పు పట్టాలి? పైగా, వారి అమాయకత్వానికి 'రోజూ పంపు ఎత్తేవాడే, అంటే, పురుగుల మందులు కొట్టేవాడే ఆదర్శరైతు' అనే తప్పుడు ప్రచారం తోడైంది. అంతా అయిన తరువాత రైతులు విచక్షణారహితంగా పురుగుల మందులు వాడారని కుంటిసాకులు చెబుతున్న వ్యవసాయ శాఖ అధికారులు గానీ, నిపుణులు కానీ పంటకాలంలో ఏమయ్యారో అర్థం కావడం లేదు. వ్యవసాయ శాఖాధికారులను, నిపుణులను ఇందుకు తప్పు పట్టాలి. ప్రభుత్వం వారిని బాధ్యులుగా చేసి ఉంటే బాగుండేది. ఈ మాత్రం జవాబుదారీ వహించని శాఖలు, అధికారులు ఉండి లాభమేమిటి?

పురుగుల మందులను విచక్షణారహితంగా వాడేట్లు చేయడంలో కంపెనీల పాత్ర ఎంతైనా ఉంది. రైతులు ఎంత ఎక్కువగా పురుగుల మందులు వాడితే వాటికి అంత లాభం.

ఈ ఆత్మహత్యల వెనుకనున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలను రచయితలు లోతుగా చర్చించారు. మార్పు చెందిన ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఈ సంక్షోభానికి ఒక మూల కారణమని రచయితలు అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో వ్యవసాయంలోకి వ్యాపార ధోరణులు ప్రవేశించాయి. అయితే, ఇవన్నీ రైతుల పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. మారుతున్న వ్యవసాయ రంగాన్ని, పెరుగుతున్న రైతు అవసరాలను గమనించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అధికారులు జవాబుదారీ వహించాలి. అంతవరకు రైతులకు దారీ తెన్నూ దొరకడం కష్టం. సుమారు 80 పేజీల పుస్తకమే అయినా పత్తిసాగు పట్ల, పత్తి రైతుల సమస్యల పట్ల చక్కని అవగాహన కలిగించే పుస్తకం ఇది. ■